**ఇక నా గురించి :—**



పూర్తిపేరు : లక్కోజు శ్రీనివాసరావు
విద్య : బి.ఏ.డిగ్రీ ఆంధ్ర యూనివర్సిటీ ద్వారా పుచ్చుకున్నాను. ప్రస్తుతం ఎం. ఏ. (తెలుగు) చదువుతున్నాను ప్రైవేటుగా (శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ).
వయస్సు : 38

కంగా విజ్ఞానదాయక విషయాలు ఆసక్తికరంగా పాఠకులు చదవాలని ప్రకటిస్తారే అక్కడ- ఆ కుడివైపు ప్రకటన చదువు- అర్థమవుతుంది నీకే" అని పడక కుర్చీలో ఆ పక్కకీ. ఈ పక్కకీ కదుల్తూ చురచుర లాడే చూపుల్తో అతని కోపకారణం వెల్లడించాడు.

సుబ్బరాయశాస్త్రి తన చూపును ఆపేపరు మొగటి పేజీ కుడివైపు పైభాగంలోకి ప్రసరింప చేశాడు ఆసక్తికరంగా.

ఆ ప్రకటనలో అతని మిత్రుని దీనావస్థకు, కోపతాపాలకు కారణం. అతని మిత్రుడు వేసే శివతాండవానికీ. అతని దూషణ భూషిత వాక్యాలకీ కారణం అర్థమయిందతనికి. కానీ మిత్రుణ్ణి ఆటపట్టిద్దామన్న తలంపుతో సుబ్బరాయశాస్త్రి తన ప్రకటన కనబడలేదనట్టు "ఎక్కడరా ?" అని మిత్రుడ్ని కవ్వించాడు.

కారకారా మండుతున్న శ్రీనివాసశాస్త్రి శరీరం ఉష్ణోగ్రత అధికమవుతుండగా ఒళ్ళు కంపిస్తున్నంతపనిగా చెప్పాడిలా– "సరిగా చూడరా వేళాకోళ మాడక! నా కనలే వొళ్ళు మండుతూంది. మిరియాల గింజ లంతక్షరాల్తో కొట్టొచ్చినట్టు సువ్యష్టంగా యెంతో కష్టపడి అచ్చువేశాడా రాక్షసుడెవరో."

మిత్రునికోపం పరిధి దాటుతూందని తెలిసి యింకా బాధపెట్టడం యిష్టంలేక శాంతింపజేద్దామనే తలంపుతో పైకి ఆ ప్రకటన (సారాంశం) గట్టిగా చదివాడు. ఆ ప్రకటన యిలా అచ్చువేయబడి వుంది:

ప్ర క ట న

"28-2-81వ తేదీ (శనివారం) మధ్యాహ్నం గూడూరునుండి విజయవాడ వైపు పోయే హౌరా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణంచేసిన శ్రీ చింతా శ్రీనివాస శాస్త్రిగారి పరువుపోయింది. దొరికినవారు ఈ క్రింది చిరునామాకు అందజేసిన తగిన బహుమతి యివ్వబడును. దానిలో కొన్ని ముఖ్యమైన కాగితాలు వుండడం వలన అతి త్వరలో తెచ్చి యివ్వ ప్రార్థన."

"ఓహో ! యిదటరా ! నీ బాధ." అంటూ సుబ్బరాయశాస్త్రి శ్రీనివాసశాస్త్రి క్షోభనర్థం చేసికొన్న వాడిలా అడిగాడు.

"ఈ ప్రకటనను ముద్రించిన ఆ రాక్షసుడ్ని..." అంటూ ఉద్రేకంతో ఊగిపోతున్న మిత్రుని ఓదారుస్తూ సుబ్బరాయశాస్త్రి—

"అది ముద్రారాక్షసంలేరా" అని నచ్చచెప్పి చల్లబరిచాడు. "పరువు అనే పేసుంటాడు. కాస్తయింకు ఎక్కువపడి తలకట్టు కల్పిపోయుంటుంది-పాపం పేపరు వాళ్ళని నిందించకురా." అన్నాడు. ●

# మినీకథ

# సానుభూతి



**వి**శాలంగా వున్న మైదానం నిశ్శబ్దంగా వున్న స్మశానంలా వుంది. ఓ మూలగా విసిరేసినట్టున్న ఎస్. పి. ఆఫీసు కొత్తగా కట్టిన ఖరీదైన పాలరాతి గోరీలా గంభీరంగా వుంది.

శవంమీద చల్లిన మరిగింజల్లా వున్నారు, అక్కడచేరిన సుమారు నాలుగైదు వేలమంది నిరుద్యోగులు. అందరి కళ్ళల్లోనూ ఆశాజ్యోతి గాలిలో పెట్టిన దీపంలా రెపరెపలాడుతోంది.

మధ్యాహ్నం పన్నెండయింది. సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు శ్రీహరి వొళ్ళంతా చెమట్లు కమ్మింది ఒంటిమీదున్న పాతచొక్కా పిండి ఆరబెట్టుకోవటానికి రెడీగా వుంది. కడుపులో రెండ్రోజుల వయసున్న ఆకలి కేక లేస్తోంది. శరీరం తోటకూర కాడలా వాడిపోయి వుంది. చేతిలో సర్టిఫికేటు వున్న ఫైల్ క్షణక్షణానికి బరువుపెరిగిపోతోంది

ఎస్. పి. స్వయంగా రిక్రూట్ చేస్తున్నాడు కానిస్టేబుల్స్‌ని. పేపర్లో ప్రకటన చూసి విశాఖపట్నం నుంచి విజయనగరం వచ్చాడు శ్రీహరి ఉదయం ఆరు గంటలకే ! ఆరు గంటలకే సెలక్షన్ మొదలయింది. తొంభయి మందిని తీసుకుంటారట ! నాలుగువేలమందికి పైనే వచ్చారు. సగానికి పైగా గ్రాడ్యుయేట్స్. సదోవంతు పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ! అందరివంకా కలియచూసి నిరాశగా నిట్టూర్చాడు శ్రీహరి.

'ఈ ఉద్యోగం నాకు రావాలి దేవుడా ! రావాలి !' కనిపించనిదేవుళ్ళందరికీ మనసులోనే మొరపెట్టుకున్నాడు శ్రీహరి. తను హాజరయిన ముప్ఫయ్యారవ ఇంటర్వ్యూ యిది. ఇదివరకు తాను పోస్ట్ గ్రాడ్యుయేట్ నన్న అహంభావం మనసు మారుమూలల్లో ఎక్కడో వుండేది ! ఇరవై ఇంటర్వ్యూల తర్వాత ఆ అహంభావం పోయింది. ఇప్పుడు వేదాంతి అయిపోయాడు శ్రీహరి. ఆఫీసరు ఉద్యోగమయినా, ఆఫీసులో ప్యూను ఉద్యోగం. ఇప్పుడు ఇంటర్వ్యూ కొచ్చిన కానిస్టేబుల్ ఉద్యోగం అన్నీ ఒక్కలాగే వున్నాయి శ్రీహరికి. 'కన్నీరు తుడవటానికి కానిస్టేబులో, క్లీనరో– అసలు ఉద్యోగంఅంటూ వస్తే అదే పదివేలు !' అన్న స్టేజిలో ఉన్నాడు శ్రీహరి.

'ఈ ఉద్యోగంకూడా రాకపోతే !' ఈ ఊహ రావటంతోనే వొళ్ళు జలదరించింది శ్రీహరికి. విశాఖపట్నంలోని తన పాడుపడ్డ పాత పెంకుటిల్లు, అందులోని జీవచ్ఛవాలు గుర్తొచ్చాయి శ్రీహరికి. పక్షవాతంతో మంచం దిగలేని ముసలితండ్రి, శుష్కించిన దేహంతో ప్రాణాలన్నీ కళ్ళల్లో దాచుకుని ఉద్యోగం వేటలో

అలసి కొంపకు చేరుకున్న తిన మొహంలోకి ఆశగా చూసే తల్లి. సాయంత్రం అవుతుండగా ఆకలి కళ్ళతో నిరాశగా సల్చుని అమ్మ కళ్ళల్లోకి దీనంగా చూసే తమ్ముళ్ళు. ఇవ్వాల్సిన కట్నంలో కనీసం సగమైనా ఇంకా తేలేదని మొగుడు తగిలేస్తే బావురుమంటూ పుట్టిల్లు చేరిన పెద్ద చెల్లాయి-ఇంటర్వ్యూకి రావటానికి ఖర్చుల కోసం ఇంట్లో అమ్మ దగ్గ వస్తువేదీ కనిపించక తను సిగ్గుపడుతూ చెల్లాయి చేతి బంగారపు గాజు కోసం చెయ్యి జాపి అడిగినప్పుడు చెల్లాయి అసహ్యంగా చూసిన చూపు-హృదయాన్ని చీల్చే కఠోరమైన చూపు. "వెళ్తానమ్మా" అమ్మతో చెప్పినపుడు నిర్లిప్తంగా అమ్మ చూసినచూపు. "వచ్చేటప్పుడు చిల్లరేమున్నా మిగిల్తే ఓ పావలా ద్రాక్షపళ్ళు తెస్తావ్రా!" నోరు తెరిచి అడగలేని ముసలి తండ్రి కళ్ళలోనిభావం. 'అన్నయ్యవచ్చేటప్పుడు డబ్బులు తెస్తాడు. రాత్రికి ఆ డబ్బుల్తో అమ్మ అన్నం వండుతుంది. హాయిగా కడుపునిండా అన్నం తినొచ్చు!' పసివాళ్ళ కళ్ళల్లో ఆకలి!—ఈ కళ్ళన్నీ తనకోసం ఎదురు చూస్తూ వుంటాయి.

"దేవుడా! ఎలాగైనా నాకీ వుద్యోగం వచ్చేటట్టు చెయ్యి!" బలహీనమైన ఆ క్షణంలో తను ఇదివరకు నమ్మని దేవుళ్ళందర్నీ పేరు పేరునా తలుచుకున్నాడు శ్రీహరి. ఎందుకంటే అప్పటికే తన మీద తనకు నమ్మకం పోయింది అతనికి.

మధ్యాహ్నం రెండవుతుండగా శ్రీహరి పేరు పిల్చారు. గాభరాగా సర్టిఫికేట్లు సర్దుకుని, మొహంమీద చెమటని ఎడంచేత్తో తుడుచుకుంటూ విశాలంగావున్న హాల్లోకి నడిచాడు శ్రీహరి.

నల్లగా, యూనిఫారంలో వున్న ఒకాయన శ్రీహరి సర్టిఫికేట్లు అందుకున్నాడు. తెల్లబట్టల్లో వున్న ఆఫీసరు పక్కనే అప్పుడే ఇద్దరు మనుషుల్ని తినొచ్చిన పులిలా హుందాగా కుర్చీలో కూర్చునున్నాడు ఎస్. పి. కరుణాకరం.

శ్రీహరి సర్టిఫికెట్లు చూసేసి. ఎత్తు కొలిచారు. బరువు చూశారు. ఛాతీ కొలిచారు. శ్రీహరి గుండె జోరుగా కొట్టుకోసాగింది. కొలతలు వేసిన చీటీ తెల్ల దుస్తుల్లో వున్నాయనకి అందిస్తూ "షార్టేజ్ ఆఫ్ హైట్ – హాఫ్ సెంటీమీటర్" అన్నాడు శ్రీహరి కళ్ళు బైర్లు కమ్మాయి. "నువ్వు బయటికి వెళ్ళిపోవచ్చు!" అన్నట్లు చేత్తో సైగచేసి చెప్పాడు శ్రీహరికి.

శ్రీహరి గబుక్కున ఎస్. పి. పక్కకు వెళ్ళి నమస్కారం పెట్టి దీనంగా నిలబడ్డాడు 'ఏం కావాల'న్నట్లు చూశాడాయన "నా పేరు శ్రీహరి సార్! ఎమ్మే సోషియాలజీ సెకండ్ క్లాస్‌లో పాసయి ఆరేళ్ళయింది. నా కుటుంబ ఆర్థిక పరిస్థితులు చితికిపోయాయి మీరెలాగైనా దయదల్చి ఈ ఉద్యోగం ఇప్పించాలి" గబగబా ఇంగ్లీషులో చెప్పాడు శ్రీహరి.

ఎస్. పి. కరుణాకరం శ్రీహరి చేతిలోని సర్టిఫికెట్లు అందుకుని చూశాడు. ఎమ్మే. సోషియాలజీ సెకండ్ క్లాస్ పట్టా. హై సెకండ్ క్లాస్ మార్కుల జాబితా! జాలిగా శ్రీహరి వంక చూసి చెప్పారు కరుణాకరం— "మిస్టర్ హరీ! నిజానికి మీ మెజర్‌మెంట్స్ సరిపోయాయి. అయినా బయట చూశారుగా యెందరున్నారో! వాళ్ళని ఫిల్టర్ చెయ్యటానికే యెక్కువ శారీరక ప్రమాణాలు తీసుకుంటున్నాం. అందుకే మీ ఎత్తు సరిపోలేదు. మీ పరిస్థితి చూస్తే నాకు జాలేస్తోంది. రియల్లీ ఐ పిటీయూ! అయినా మీరు ఎమ్మేచదివి ఈ కానిస్టేబుల్ ఉద్యోగానికి రావటమేమిటి? రేపొద్దుట మీ స్టేషన్‌కి ఓ బియ్యే పాసయిన కుర్రకుంక ఎస్సైగా రావొచ్చు! వాడికి మీరు నమస్కారాలు చేస్తూ అణిగి మణిగి ఉండాలా? నో! నో! ఐకాంట్ టాలరేట్! వచ్చే సంవత్సరంలో ఎస్. ఐ. సెలక్షన్స్ ఉన్నాయి. అప్పుడు రండి. మిమ్మల్ని నేను తప్పకుండా రికమండ్ చేస్తాను! విష్ యూ బెస్టాఫ్ లక్!" చింత నిప్పుల్లా ఉన్న కళ్ళలో సానుభూతి కురిపించి శ్రీహరి భుజం తట్టూ చెప్పారు కరుణాకరం. "వొద్దు సార్! నాకు వొచ్చే సంవత్సరం ఎస్ ఐ. పోస్టువద్దు. ఇప్పుడే కానిస్టేబుల్ ఉద్యోగం కావాలి" అని నోరు విప్పి చెప్పలేకపోయాడు శ్రీహరి. అతని గొంతు పూడిపోయింది. మౌనంగా కదిలాడు అతని కళ్ళనుంచి రెండు వెచ్చటి నీటిబొట్లు జారాయి.

* * *

ఎస్. పి. కరుణాకరం కళ్ళనుంచిరెండు వెచ్చటినీటిబొట్లు చెంపలమీదుగాజారాయి. ఆయనకళ్ళు పేపరుమీద వార్తపై పు మరో సారి కదిలాయి. విజయనగరం. ఏప్రిల్ 14: నిన్నరాత్రి శ్రీహరి అనే యువకుడు విజయనగరం లంకవీధి చెరువులోపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉద్యోగం దొరక్కపోవటమే ఆత్మహత్యకు కారణంగా స్థానికులు భావిస్తున్నారు. మృతుడు శ్రీహరి చెరువువొడ్డున వొదిలేసిన సర్టిఫికేట్లతోపాటు తల్లి పేర్న 'అమ్మా! అసమర్థుణ్ణి! క్షమించు-హరి' అని ఒకేఒక వాక్యం వ్రాసిన ఓ ఉత్తరం లభ్యమయింది. విజయనగరం 1వ టౌన్ పోలీసు సబ్ ఇన్స్‌పెక్టర్ శ్రీ విద్యాధర బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు....

"మనిషికి కావాల్సింది సానుభూతికాదు సరైన సమయంలో సహాయం-చేయూత" అని నిన్న నీ కొడుకు చెపితే ఒకరోజు ఆలస్యంగా అర్థంచేసుకున్నా నమ్మా! ఫలితం ఇంత దారుణంగా వుంటుందని అనుకోలేదు. నన్ను క్షమించు. వో మై పూర్ మదర్! ఫర్‌గివ్ మీ" తనలో తనే గొణుక్కున్నారు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కరుణాకరం.


యెలిశెట్టి శంకరరావు


## వివరాలు

జననం: 31-3-1958

తండ్రి శ్రీ ధర్మారావు. తల్లి శ్రీమతి పైడిరాజు.

ఎమ్. ఎ. డిస్‌కంటిన్యూ చేసి ప్రస్తుతం ఉద్యోగాలవేటలో ఉన్నాను. రాయాలనే తపన ప్రారంభం కావటానికి ఇన్‌స్పిరేషన్ యండమూరి వీరేంద్రనాథ్. బీనాదేవి, రావిశాస్త్రి మాక్సిమ్‌గోర్కీ, పురాణం శర్మ, శరత్, చలం నా అభిమాన రచయితలు.



ఆంధ్రప్రభలోనే తొలికథ ప్రచురింపబడింది. సుమారు వో యాభైకథలు వ్రాశాను. సామాజిక సమస్యలకు పరిష్కారం చూపించాలన్నదే నా ఆశయం.

—యెలిశెట్టి శంకరరావు